తెరవెనుక దీపం

శ్రీ రాధా ప్రియ

అప్పటికి గంటనుంచి అటూ యిటూ మసలుతూన్నా రవణమ్మకు, కంటిమీాదకు కునుకు రావటంలేదు. పగలంతా రెక్కలు ముక్కలు చేసికొన్న ఒళ్లు విశ్రాంతి తీసికోవటానిగ్గూడా ఆ రోజు మొరాయించింది. ఒళ్లయితే అలిసిందిగాని, తలకాయలో ఉసిళ్లపుట్టలా ఆలోచనలు రేగి, వాటి ఫలితంగా గుండెల్లో బాధా, పర్యవసానంగా కంటివెంట నీరూ, రావటంచేత, వాటన్నింటిని కొంతవరకైనా కట్టేసే నిద్దర భయపడి పారిపోయింది. తలకింద ఎత్తుకోసం పెట్టుకొన్న పాత చీరె దాదాపూ తడిసిపోయింది.

లేచి బయటకెళ్లి, ముక్కు చీదుకొని, పమిట చెంగుకు తుడుచుకొని కూర్చుంది. గదిలో గుడ్డిదీపం చావలేకా, బతకలేకా అల్లల్లాడుతూంది. ఆ రవంత వెలుగులో రవణమ్మ నీడదెయ్య మల్లే గోడమీాద కదలటం ఆవిడక్కనిపిస్తూనేవుంది. గుడిశెలో ఓమూల చిన్న ట్రంకుపెట్టె మరీ పాతది వుంది. కొడుకు పుస్తకాలు పెట్టుకోవటానికి ఆ స్కూలు హెడ్మాస్టరు భార్య యిచ్చిందది. ఓమూల కట్టిన దండెంమీాది నుంచి రవణమ్మవి రెండు పాతచీరెలూ, ఓ చింకి దుప్పటీ, సత్యానివి రెండు పాతచొక్కాలు, రెండు లాగూలు వేలాడుతున్నయి. కూడొండుకునే చోట రెండు చిన్నకుండలూ, పిడతలూ, ఒకటో రెండో సత్తు గిన్నెలూ, గ్లాసులూ వున్నయ్. గుడిశె మధ్యలో ఓ చింకి చాపమీాద పాత దుప్పటీ పరచివుంది. ఎదురుగ్గా సత్యం పుస్తకాలు, పాతవి వున్నయ్.

ఇందులో యేవీ రవణమ్మకు ఆశ్చర్యం కలిగించేవికాదు గనుక, ఆవిడ వీటిని గురించి పట్టించుకోలేదు, కథకుడు పట్టించుకొన్నంతగా. ఆమె తల్లో రేగుతున్న ఆలోచనలూ, గుండెల్లో మండుతూన్న సెగలూ వేరు. ఆవిడకివ్వేళ్ల నాలుగునెల్లనాడుపోయిన ఇరవయ్యేళ్ల కూతురూ, చిన్ననాటి బావ, మొగుడూ గుర్తొస్తున్నారు.

ఆ సాయంకాలం, తను పనిచేసే ప్లీడరుగారింట్లో ఆయన పెద్దకూతురు ప్రసవించి పండంటి కొడుకును కన్నది. వారింటినుంచీ వొచ్చిందగ్గర్నుంచీ రవణమ్మకు మనసు మనసులో లేదు. రంగి కూడా యిట్లాగే పండంటి బిడ్డను కని పదికాలాలపాటు చల్లగా వుండ వలసింది. కాని దేవుడు తన నన్యాయం చేశేడు. సరిగ్గా నాలుగు నెల్లనాడు రంగికి నొప్పులొస్తున్నాయని కబురొస్తే పరుగు పరుగున వెళ్లింది. తొలి చూలు. తన యింటికి కూతుర్ని తీసికు రావటమే రివాజు. కాని ఈ దరిద్రంలో కూతుర్ని తీసికొచ్చి తనేం చేయగల్దు? వియ్యంకుడు పెద్దమనిషి. కష్టసుఖాలు తెలిసినవాడు. అతగా డన్నాడు—

'నువ్వుమాత్రం ఒంటరిదానివి పిల్లనీ్తసికెళ్లి ఏం తిప్పలు పడతావ్? ఇక్కడ జనానికి లోపం లేదు. ఇట్టాంటివి మీా వొదిన క్కొట్టినపిండి. పది మందిని కన్నదిగా, దక్కింది నలుగురే అయినా. అందుకని నువు లేనిపోని హైరాన పడమాక. నొప్పులు వొచ్చే వేళక్కబురు చేస్తారు. వొచ్చేద్దువుగాని.'

తను మాత్రం యేవన గల్దు?

సరే, వెళ్లింది. నిండా యిరవైలేని రంగి, మరో ప్రాణాన్ని భూమ్మీాదకు నెట్టే ప్రయత్నంలో విపరీతమైన బాధ పడుతోంది. మెలికలు తిరిగిపోయే దాని వొళ్లూ, చెమటలుపట్టే ముఖమూ, గొంతు చినిగి పోతుందేమో అనేంత కేకలూ, రవణమ్మకు భయం పుట్టించేయి.

కాన్పు సులు వవలేదు. చుట్టు పక్కలవాళ్లు అసుపత్రికి తీసికెళ్ళమన్నారు. తీసికెళ్ళేరు.

అయినా కూతురు దక్కలేదు. పిల్లాడు మాత్రం తుండు ముక్కలా వున్నాడు. ప్లీడరుగారి మనవడేం చాల్తాడు వాడిముందు? ఇంకో నిమిషానికి ప్రాణం పోతుందనగా, తనవేపుచూసి, పక్కలోవున్న పసికందును చూసి కళ్ళతో అంది—

'అమ్మా! నాకొడుకును కడుపులో పెట్టుకోవే!' అని.

తను భోరుమని యేడుస్తూ, 'నీకొడుకున్నేను కళ్ళల్లో పెటుకొని పెంచుతాను. నువు మాత్రం నన్నన్యాయంచేయకే' అంది.

రంగి అన్యాయమే చేసింది.

ఆ చంటి వెధవను కడుపులోనూ, కళ్లల్లోనూ పెట్టుకొని పెంచాల్సిన అవసరమే కలగలేదు తనకు. ఆ గుంటడికి తల్లిమీద అంత మక్కువేమిటో! తలి వెంటే ఓ గంట ఆలశ్యంగా వెళ్లిపోయేడు.

రవణమ్మకు దుఃఖం తెరవొచ్చింది పుధృతంగా. రెండు నిమిషాలు వెక్కివెక్కి యేడ్చింది. 'అసలు తన బతుకే పాపిష్టిది. లేకపోతే తనబతుకులో సుఖపడ్డదేముంది? చిన్నప్పుడు పద్నాలుగేళ్లు వొచ్చిందాకా కాస్త సంతోషంగా బతికింది. ఆ తరవాతనుంచి అన్నీ కష్టాలే.'

బతుకులో తా నెరిగిన మొదటిదెబ్బ బావ పోవటం.

బావ మంచి వాడు. వాడికి తనంటే వల్లమాలిన యిష్టం. తనకు వాడంటే బయటకు చెప్పలేనంత ప్రేమ. వాడు తనకు మేనత్తకొడుకు. బావకు పదేళ్ళప్పుడు అత్త పోయింది. పోతూ వాణ్ణి నాన్న కప్పగించి, 'ఒరేయి అన్నా, బంగారంలాంటి కొడుకును నీ చేతుల్లో పెడుతున్నాను. పెంచి, కూతుర్నివ్వరా!' అంది. అయ్య అట్లాగే నని వొట్టు వేసేడు.

మాఘ మాసంలో పెళ్ళి నిశ్చయం చేశేరు. రమణమ్మ కప్పుడు పదిహేను. వెంకటేశ్వర్లుకు పద్దెనిమిది. పెళ్ళి నిర్ణయం జరిగేక బావముఖంలోకి చూడాలంటే రవణమ్మకు వల్లమాలిన సిగ్గు పుట్టుకొచ్చేది. వాడుమాత్రం కళ్ళనిండా వెలుగు నింపుకొని రవణమ్మకేసి పోకిరి చూపులు చూసేవాడు.

ఇంకో నెలరోజుల్లో పెళ్లనగా ఒకరోజు పొలం నుంచి వొచ్చి వొళ్లు నొప్పులుగా వుందని పడుకొన్నాడు వెంకటేశ్వర్లు. అర్రాత్రికి జ్వరం కాసింది.

అంతే, వాడు మళ్లీ తేరుకోలేదు. అదేదో విషజ్వరమట. ఇరవయ్యొక్క రోజులు మనిషి నలిశి, మరునాడు పోయేడు.

ఆవేళ రవణమ్మ గుండెలు పగిలేలా యేడ్చింది. ఏమైనా చేయగలగిందే ముంది గనుక?

పుణ్యంచేసికొన్నవాళ్ళు కష్టాల్లేకండా తొందరగా వెళ్ళిపోతారు.

తనలాంటి పాపిష్టి వాళ్ళు బతుకుతారు, వొందేళ్లు, యిన్నియాతనలూ పట్టానికి.

ఆ వైశాఖంగాక తరవాత వైశాఖంలో తనకు పెళ్లయింది వీరయ్యతో. తనూ అడ్డుచెప్పలేదు.

అతనూ మంచివాడే. నెమ్మదస్తుడు. తనను బాగానే చూసుకొనేవాడు. తనూ అతగాణ్ణెప్పుడూ కష్టపెట్టలేదు.

అయితే మనస్సునిండుగా అతన్ని ప్రేమించ లేక పోయింది. ఆదెట్లా కుదురుతుంది? బావనుయిష్టపడ్డంతగా తానుమరొకర్ని యెలా యిష్టపడగలదు? బావ యెదురుగ్గావుంటే తాము యిద్దరు విడి మనుషులమని అనిపించేదే కాదు. వాడంటే తనకూ వొళ్ళూ, మనసూ అంతా ప్రేమే. తన శరీరమే కొంత వాడిదగ్గర వున్నట్లుగా వుండేది.

నిజం చెప్పమంటే తాను మొగుణ్ణిలా ప్రేమించలేదు. ప్రేమించలేదు అంటే అది తన చేతుల్లో లేదు. అయితే యేం? తనకు చాతయినంత వరకూ వీరయ్యను సుఖపెట్టింది. అతన్ని కంటికి

రెప్పలా చూచుకుంటూ, ఆయన్తో ఎనిమిదేళ్లు కాపురం చేసింది.

పొరుగూరు వెళ్లి పాము కరచి వీరయ్య చని పోయినప్పుడు రవణమ్మకు పాతిక నిండలేదు. అప్పుడు రంగికి ఐదేళ్లు. సత్యానికి యేడాది వెళ్లింది.

ఆ తరవాతనుంచీ ఆవిడకష్టాలు మొదలయ్యేయి.

అప్పట్నుంచీ వారింట్లో వీరింట్లో చాకిరీచేసి పిల్లల్ని పైకి తీసుకొచ్చింది.

ఈడు రాగానే చాతయినంతలో అనువైన సంబంధం చూసి కూతురికి పెళ్లి చేసింది. ఏం లాభం? దాని బతుకట్లా తెల్లారింది.

సత్యం బళ్లో చదువుతున్నాడు పదో తరగతి.

ముందేవి కానుందో!

* * *

'ఇంకా పడుకోలేదా అమ్మా!' అంటూ వొచ్చేడు సత్యం చలపతి మేస్టారింటినుంచి. రవణమ్మ ఆలోచనల్నుంచీ తేరుకొంది.

'లేదయ్యా ! ఎందుకనో యివ్వేళ్ల నిద్దర పట్ట లేదు. చదువయ్యిందా?' అని అడిగింది.

'ఇవ్వేల్టికయింది. రేపు బడి కెళ్లేపాటికి పది లెక్కలు చెయ్యాలి. బుడ్లో కిరసనాయిలు లేనట్టుందే!' అన్నాడు.

'అయిపోవొచ్చిందిరా. పొద్దున్నే రాసుకోవొచ్చులే. బాగా పొద్దుపోయినట్టుంది, పడుకోలే! అంది రవణమ్మ.

'నీకేం, అట్టాగే చెబుతావ్. ఒక్క లెక్క చెయ్యకపోయినా ఆ మేస్టారు చావగొడతాడు.' అని గునిసి, ఆ వేళప్పుడు చేసే వోపికలేక, కిరసనాయిల్లేని బుడ్డిని కాసేపు తిట్టి నిద్రకుపడ్డాడు, సత్యం.

మరో అయిదు నిమిషాల్లో ఆదమరచి నిద్ర పోయేడు.

రవణమ్మ కొడుకుదగ్గర చేరి వొంటిపైద చెయ్యేసింది.

'ఏవిటో, వీడి బతుకెట్టా తెల్లవారాలో! భగవంతుడి దయవల్ల వీడికి నాలుగు ముక్క లబ్బుతున్నయి. ఈ పదో తరగతయ్యేక యేం చెయ్యాలో! పెద్దచదువులు చెప్పించే తాహత్తు తన కెక్కడది? జీతాల్లేక పోబట్టి ఎట్లాగో ఈ ఐదేళ్లబటి నెట్టుకొస్తూంది. పాత పుస్తకాలు ఎవరో పుణ్యాత్ములు యిస్తూనే వున్నారు. మరి దీం తరవాత?'

కోరికయితే కొడుకును బాగా చదివించుకోవాలనేవుంది. తను బతికేది వాడికోసం గాదూ? మరి ఆధరువో!

రవణమ్మ బాగా అలిసిపోయింది. చాకిరీచేసి వొళ్లూ, బాధపడిన మనసూ రెండూ బరువెక్కినయ్. అంతవరకూ ఏడవటంవల్ల మనస్సు కడిగేసినట్లు, శాంతంగా వుంది. అట్లాగే కొడుకు సరసన నడుం వార్చి కళ్లు మూసికొంది రవణమ్మ.

* * *

రవణమ్మ ఓ అందమైనగదిలో ఎత్తుగావున్న కుర్చీలో కూర్చుని వుంది. గది నాల్గుగోడలూ కొత్తగా వెల్లవేయించబడి తెల్లగా మెరుస్తున్నాయి. లోన వెలిగే ట్యూబులైటు కాంతి పాలకంటే తెల్లగా పరచుకొంది గదంతా. ఆవిడ కెదురుగ్గా బల్లమీద వొలచిన బత్తాయిలూ, ద్రాక్షలూ వున్నాయి. ఒక్కటొక్కటే ద్రాక్షపళ్లు నోట్లో వేసికొంటూ కూర్చొంది. తను ఖరీదైన పట్టుచీర కట్టుకొనివుంది. చేతులకు బంగారు గాజులున్నాయి. ఇంతలో గదితలుపు తీసికొని సత్యం లోనికొచ్చేడు. అతడు చాలా దర్జాగా, ఠీవిగా వున్నాడు. నల్లటి సూటూ, బూటూ నిగనిగ మెరుస్తున్నాయి. నొక్కుల జుత్తు వొత్తుగా, నల్లగా, షోగ్గావుంది. ముఖంలో రాజుకుండే దర్పముంది. చేతికి బంగారపు చైనువాచీ, రెండువేళ్ళకు రెండు వజ్రాలు తాపటంచేసిన ఉంగరాలు లైటు వెలుగులో మెరుస్తున్నాయి. మెళ్ళో డాక్టర్లు వేసికొనే రబ్బరు తాడుంది. దగ్గరగావొచ్చి జేబులోంచి నోట్లకట్ట నిర్లక్ష్యంగా తీసి తల్లి కిచ్చేడు. అన్నీపదులు పెళపెళలాడుతున్నాయి. రవణమ్మకళ్లు మెరిసేయి.

కొడుకు వొచ్చినవాడు వొచ్చినట్లే వెళ్ళి పోయేడు.

ఎదురుగ్గావున్న బల్ల కాలితో గోకుతోంది రవణమ్మ పాదాన్ని. రవణమ్మకాలు లాక్కుంది. దాని వెంటే మెలకువా వొచ్చింది.

కళ్ళు తెరిస్తే అలవాటయిన గుడిసే, బెదురు చూపులు చూసే ఎలకా కనిపించేయి.

లేచి కూర్చుంది. సత్యం వొళ్ళుమరచి నిద్ర పోతున్నాడు. బయటకొస్తే చీకట్లు విచ్చుకొంటు న్నాయి.

'ఏవి టిట్టాంటి కలొచ్చింది? తన కంతటి అదృష్టవా? ఏవిటో దిక్కుమాలిన కలలు. ఇంకా నయం. పెందరాళే మెలకువొచ్చింది. కాస్త ఆలస్య మయితే డాక్టరుగారి పెళ్ళాం నానా మాటలూ అంటుంది; అనుకొంటూ రవణమ్మపనికి బయల్దే రింది.

*   *   *

రవణమ్మ డాక్టరు గారింట్లోనూ, రాఘవయ్య గారింట్లోనూ పని ముగించుకొని చలపతి మేష్టారింటికి వొచ్చేవేళకు, ప్రక్కవారి రేడియోలో భక్తిరంజని వొస్తోంది. చలపతి గారి భార్య రవణమ్మను చూస్తూనే, 'కాస్త పెందరాళే రా రవణమ్మా' అని గునిసి, గిన్నెలు బయట వేయటానికి లోపలికెళ్ళింది.

చలపతి గారు ఆవూరి హైస్కూలులో సెకండరీ గ్రేడు మాష్టరు. ఆయన వూరి కొచ్చి పదిహేనేళ్ళవు తోంది. ఇక్కడే స్థిరపడిపోయేరు. ఆయనకు నల భయ్యయిదోయేట భార్యపోయింది, నలుగు రాడపిల్లల్ని ఈన కప్పగించి. ఆయన కొన్నాళ్ళు భార్యను గురించి బెంగెట్టుకున్నాడు. ఆ తరవాత నాలుగేళ్ళకు ఓ పాతి కేళ్ళ అమ్మాయిని వివాహం చేసికొన్నాడు. లోకు లాయన చేసిన పనిని కొంత చాటుగానూ, కొంత పబ్లిగ్గానూ గర్హించేరు. అయినా యిలాంటి విష యాల్లో ఒకరి సలహాలతో పనేవుంది గనక! చలపతి గారికి భార్య అవసరం యింకావుంది. ఆయన పెళ్లి చేసికొన్నాడు. లోకులగోల యేవిటంటే, 'పదహారేళ్ళొచ్చి పెండ్లికెదిగిన పిల్లయింట్లో రొమ్ములమీది కుంప టిలా వుంటే, దాదాపు యాభయ్ సీటకిందికొచ్చిన యితగాడు సిగ్గులేక మళ్ళీ వివాహం చేసికోవటం యేవిటీ?' అని.

లోకు లేవనుకొనేది తెలీని, కనీసం వూహించ లేని నాపేం కాదు చలపతిగారు. ద్వితీయం చేసికొన్న దాకా ఆయనకు నిద్రపట్టని మాట వాస్తవమేగాని, ఇటీవల అంటే వివాహమయిన నాలుగేళ్ల తరవాత, ఆయనకూ తాను చేసినపని దోషమేమో ననిపిస్తోంది. ఎందుకంటే యింక ఆయనకు రెండేళ్ళ మాత్రమే సర్వీసుంది. ఈ సంబంధాని కిద్దరు పిల్లలు. ఒక అబ్బాయీ, అమ్మాయీను. తొలి సంబంధం పిల్లల్లో పెద్దవాళ్ళిద్దరూ యీడేరి కూర్చున్నారు. వాళ్లను చెరో యింటికి పంపి బాధ్యత వొదిలించుకోవాలిగదా! మిగతా వాళ్లను పెద్దవాళ్లను చెయ్యాలిగదా! ఇప్ప డివన్నీ ఆలోచించుకొంటే ఆయనకీ సాగరాన్నెలా యీదటమా? అని భయంగానే వుంది. లోకులు కబు ర్లయితే చెబుతారుగాని, బాధ్యతలు నెత్తినేసికోరు గదా!

మరి తెలిసి, తెలిసీ ఈ వయస్సులో ఈ తప్పెడు పని యెందుకుచేసేవంటే, ఆయన సమాధానం ఆయన కుంది. 'ఎన్నిమాటలు చెప్పినా, నేపోయిం తరవాత, నెత్తిన కొరివిపెట్టి, యిన్నినీళ్లు చల్లేవాడొకడుండాలి గదా! కొడుకు పుట్టకపోతే అదేం బ్రతుకు?' అంటా రాయన.

ఆయన ఆశించినట్లు కొడుకయితే కలిగేడు గాని, ఆయనకు బాధ లెక్కువే అయ్యేయి. భార్యకు తానంటే గౌరవం లేదన్న విషయం, ఆయన కొత్త మోజులో గమనించటానికి యిష్టపడకపోయినా రోజులు గడిచే కొద్దీ ఆయనకు విషయం స్పష్టంగానే తెలిసింది. తాము లేనివాళ్లైన కారణంచేత, తమ నిస్సహాయ త్వాన్ని నీచంగా వుపయోగించుకొని, తన వయస్సులో సగం మాత్రమేవున్న ఆడదాని గొంతు కోయటానికి సిద్దపడ్డ చలపతిగారి సహృదయత మీద కామాక్షికి రవంతకూడా సదభిప్రాయం లేదు. కనీసం ఆయన బాధేవిటోనని ఆవిడ సానుభూతితో ఆలోచించిం

లేదు. తాను చేయని తప్పుకు భగవంతుడు ఈ రకంగా శిక్షించేడనుకొని, ఆ శిక్షను తప్పనిసరిగా అనుభ విస్తూ అందుకు కనిపించే కారకుడైన చలపతిగారి పట్ల కామాక్షి అయిష్టాన్నే పెంచుకొంది. ఇవన్నీ గ్రహించే నాటికి చలపతిగారికి దిద్దుకోవటాని కేమీ కనిపించలేదు. ఇప్పుడు బాధపడి ప్రయోజనం యేవుంది గనుక? ఒక పని, మంచికానీ, చెడుగానీ జరగవలసి నప్పుడు, అది అల్లా జరిగే తీరుతుంది. నువు చెయ్యడ్డంపెట్టి ఆ పనిని కాకుండా ఆపలేవు. పశ్చా త్తాపం అనవసరమూ, అవివేకమూను. సృష్టిలోని శక్తులన్నీ నీవు తాగబోయే పాలను వొలకపొయ్యాలని కూర్చుంటే, అయ్యో! పాలు వొలికి పొయ్యేయే అని బాధపట్టం వెర్రితనం కాదూ! చెయ్యగలిగిం దేమీ లేనప్పుడు, కాలాన్ని దాని మానాన దాన్ని పోనివ్వ టమే! చలపతిగా రిటీవల యీ రకమైన వేదాంతం వొంట బట్టిచ్చుకొని రోజులు గడుపుతున్నారు.

రవణమ్మ పని ముగించుకొని వొచ్చేవేళకు, సత్యం మేసా రింటికి చదువుకుందుకు వొచ్చేడు. వాణ్ణి చూడగానే రవణమ్మకు తెల్లవారుజామున వొచ్చిన కల గుర్తొచ్చింది. 'నిజంగానే సత్యం అంత గొప్పవాడవు తాడా? అట్లా నోట్లకట్టలు తీసికొచ్చి తన కిస్తాడా? ఏ వీలేదు. బీదవాళ్లంటే కలలకూ లోకువే!' సత్యం బుజంమీది, రూపాయి కాసంత చినుగును చూస్తూ రవణమ్మ అనుకొంది.

'ఈ యేడు పరీచ్చ గట్టెక్కుతాడా అయ్య గారూ!' అని అడిగింది చలపతిగార్ని, తడిచేతులు చిరు గుల పమిటకు తుడుచుకొంటూ.

సత్యం తెలివైన కుర్రవాడి కిందే లెక్క. వాడికి చదువుపట్ల శ్రద్ధ కూడా వుంది. పైగా వాళ్ల పరి స్థితులు వాడికి బాగానే తెలుసు. అందుకని కష్టపడి చదువుతాడు. ఆ విషయం అందరకూ తెలుసు. అయినా ఎదురుగ్గా విద్యార్థినుంచు కొని, వాణ్ణి పొగట్టం మంచనిపించలేదు పంతులుగారికి. పైగా ఈప్రశ్న వారానికో మారైనా రవణమ్మ అడుగుతూనే వుంటుంది ఆయన్ను. ఆయన్నవేవిటి? ఏ మేస్టరు కనపడ్డా ఆమె అడిగేప్రశ్న అదే. ఆమె తాపత్రయం తెలిసిన మేస్టా రన్నారు, అవుతాల్లే. అయినా శ్రద్ధతీసుకొని కష్టపడి చదివాలి. గవర్నమెంటు పరీక్షలుకదా!

రవణమ్మ వెంటనే అందుకొంది, 'నాదేవీ లేదయ్యా గారూ. వాణ్ణి మీరు కొట్టినా, తిట్టినా నాకిష్టమే వాణ్ణి మీచేతుల్లో పెట్టేను. మీ ధర్మమా అని నాలుగు ముక్కలబ్బితే అంతే చాలును!'

'అల్లాగేలే!' అన్నారు చలపతిగారు సంభాషణ త్రుంచుతూ.

*　　　*　　　*

వారం రోజుల తరవాత వో సాయంకాలం రవ ణమ్మ మేస్టారింటికి బయల్దేరింది. ఆవిడ తలలో యిప్పుడు ఒకేవొక్క ఆలోచన విపరీతంగా కదులు తోంది. ఆక్రితం రోజు సాయంత్రం వాళ్ల యిళ్ల పక్కల వాళ్లు యేదో పిచ్చాపాటి మాట్లాడు కొంటూండగా, సంభాషణ లాటరీలమీదకు మళ్లింది.

తాగుబోతు గంగడన్నాడు, 'అదేదో వూర్లో వొటేల్లో పన్చేసే కాఫీ లిచ్చే ఆయన రూపాయి గడితే లక్షొచ్చేయట. ఇక చూడు నారంగా, ఆ వోటలు పొప్పరయిటరు, యీడికాళ్లు గడిగి నీళ్ళు నెత్తిన్నల్లు కొని కూతుర్నిచ్చి పెళ్ళిచేసి, వోటలువాడికే వొప్ప చెప్పేట్ట!'

'ఆడి దాకాబోతావేం? వాడిపేరు నాకు గుర్తు రావటంలేదు. బస్తీ పోయినప్పుడోసారి నేను ఆడి రిచ్చా కూడా యెక్కేను. వాడికదేదో లాటరీలో రెండు లచ్చలొచ్చేయట. నీకెట్టా తెలుసని అడగవేం? మొన్న ఊరెళితే, ముందేదో యెనకేదో తెలీని కారుపక్కన నుంచోని కోటూబూటూయేసి, దొరల్లాగే జానెడు పొడుగుచుట్ట నోట్లోపెట్టుకు నిలుచుంటే ముందు బిత్తరపోయే నంటే నమ్ము. ఇదేందబ్బా! పోయి నేడాది నన్నెక్కించుకొని రిచ్చాతొక్కి సందు మలుపులో వున్న యింటికాడికి రోడ్డంతా చుట్టూదిప్పి, నాలు గంగల్లో వెళ్లేచోటికి అర్ధరూపాయి పుచ్చుకొన్నాడు. గందా అని ఆచ్చెర్య పోయేను. ఏవైనా యీవంటావు? ఆడిప్పుడు లచ్చాధికారి! గంగడి బావమరది అందు కొన్నాడు.

'అందరి కొస్తాదంటరా? అదురుష్టముండాల. దానికీ పెట్టిపుట్టాల'. అన్నాడు వెంకడి తండ్రి ముసలయ్య.

'అదురుట్టం వుందోలేదో తెలిసే దెట్లాగే? నువు గట్టరాదు మామా! నీది మంచి జాతకమేలే. పిల్లనిచ్చిన మావను మూణ్ణిద్దర్లలోనే గుటుక్కు మనిపిస్తివిగా!' గంగడు ముసలయ్యకు పరిహాసం చేసేడు.

'చీ! యదవనాయాల. తాగుబోతూ కబుర్లాను ఝ్వానా. విసుక్కొన్నాడు ముసలయ్య.

ఓ మూల కూర్చొని యిదంతా వింటూన్న రవణమ్మను చూస్తూ గంగడి బావమరది అన్నాడు.

'నువ్వొక టికెట్టు కొనరాదే అత్తా. దేవుడు చల్లంగ జూస్తే సత్తేన్ని కలకటేరును జేద్దువుగాని!'

రవణమ్మ నవ్వుతూ అంది, 'ఇకజాల్లేరా పోకిరి యెదవ. నా కంతటి రా తెక్కడిది'?

ఆ తరవాత రవణమ్మ అక్కణ్ణుంచి లేచొచ్చింది. కాని మనసు మాత్రం లాటరీ టిక్కెట్టును గురించే ఆలోచించటం మొదలుపెట్టింది.

'ఏమో, ఏ పుట్టలో ఏముందో ఎవరు చూశేరు? రోజులు బాగుండి అట్టాంటి అదురుష్టమే కలిగితే సత్తేనికి పెద్దచదువులు చెప్పించొచ్చు. రంగనాదంగారి కొడుకులాగే పెద్దడాకటరును చేయొచ్చు. అప్పుడు తన బతుకు మూడు పువ్వులూ ఆరు కాయలూ అవుతుంది.'

రవణమ్మ కెందుకో వారం రోజులనాడు తెల్లవారు జామున వొచ్చిన కల నిజం అవుతుందని అనిపించ సాగింది. ఆ కల్లోలాగే తాను గొప్పయింట్లో కూర్చొని కొడుకు అంత ఠీవిగా సూటూ బూటూ వేసికొని నోట్లకట్టలు తెచ్చి తన చేతుల్లో వుంచటం యెంత గొప్పగా వుంటుంది! సాటివాళ్లలో ఎంతపేరు! లోకులంతా సత్యాన్ని చూపి, 'ఆ వెళ్లే ఆయన రవణమ్మగారి కొడుకు. పెద్దడాక్టరు. రెండు చేతులా సంపాదిస్తున్నాడు. తల్లిని నెత్తిన పెట్టుకొంటాడు. కులం, గోత్రాలతో పనిలేదు. బోలెడంత కట్న మిస్తామని సంబంధాలు తెగవొస్తున్నాయి' అని అంటూంటే తన కెంత ఆనందంగా వుంటుంది?'

ఈ వూహలతో రవణమ్మ కా రాత్రి కంటి మీద కునుకు పట్టలేదు. కన్ను మూసినా, తెరచినా సత్యం సూటూ బూటూ వేసికొని కనబడసాగేడు. తెల్లవారే పాటికి రవణమ్మ ఒక నిర్ణయాని కొచ్చింది. 'ఏమైనా కానివ్! ఓ రూపాయి ఖర్చుపెట్టి టిక్కెట్టొకటి కొంటుంది. వొస్తే అదురుష్టమే. పోతే రూపాయి గంగలో కలిపాననుకొని ఒకేడు పేడిచి వూరు కొంటుంది.'

ఆ నిర్ణయం తీసికొన్నాక రవణమ్మ క్కాస్త ప్రశాంతత చిక్కింది. సాయంకాలం పనవగానే రవణమ్మ యిందుకే చలపతిగారింటికి బయల్దేరింది. ఆమెకు చలపతిగారంటే నమ్మకం. సత్యం చిన్నప్పటి నుంచీ ఆయన్దగ్గిరే చదివేడు. ఆయన పుణ్యమా అని నాలుగు ముక్కలు వొంటబట్టేయి. పైగా యిట్లాంటివి తన కస్సలు తెలీదు. ఏ టిక్కట్టు కొనాలో, ఏది సజావయిందో తనకేం తెలుసు? ఏదో కాయితం చేతిలోపెట్టి తనను ముంచినా ముంచగలరు. సత్తేనికి చెప్పొచ్చును గాని వాడికి మాత్రం యేం తెలుసు యిట్లాంటి పనులు? చిన్నయెదవ. తనయినా పిల్లాడి బాగుకోసమని ఒక ప్రయత్నం చెయ్యబోతూవుంది. ఇదే మొదటిదీ, చివరదీను. ఈ పని గుట్టుగా చేయించాలంటే పంతులుగారికే తగును. ఆయనకు తను పడే పాట్లూ, సత్యం కోసం తను పడుతూన్న యిబ్బందులూ తెలుసును.

రవణమ్మ వెళ్లేసరికి చలపతి గారు పంచలో కొడుకుతో ఆడుకొంటున్నారు. భార్యా, పిల్లలూ కరణం గారింటికి పేరంటం వెళ్లేరు, కూతురు రజస్వల అయితే.

'ఏవిటొచ్చేవు? ఆమె యింట్లో లేదు.' అన్నారు మేస్టారు.

'మీతో పనుండే వొచ్చేనయ్యా!' అంది.

ఏవిటన్నట్టు చూశేరాయన.

కొంగున కట్టుకొన్న రూపాయి కాయితం ఆయన ముందుంచి అంది, 'ఒక లాటరీ టిక్కట్టు కొనండయ్యా!'

ఓ అరనిమిషం అర్థం కానట్లుచూసి, తరువాత వెంటనే నవ్వి అన్నారు చలపతిగారు—

'నీకూ వుంది ఈ పిచ్చి?'

రవణమ్మ ఏదో తప్పు చేసినట్లు జంకింది; 'ఈ వొక్కసారే చూద్దామనుకొన్నా, నయ్యా! రోజులు బాగుంటే సత్యం పైకొస్తాడు. లేకపోతే ఈ రూపాయి తోనే చెల్లు!'

'అటా గేలే'! అన్నారు మేష్టారు. పిల్లవాడి చేతిలోంచి మెల్లిగా రూపాయి విడిపించు కుంటూ.

'ఎవరితోనూ అనకండయ్యా!' అంది వెళ్ళబోతూ.

'ఓసీ నీ యిల్లు బంగారంగాను. ఇదేం పాపం కాదులే!' అన్నారాయన నవ్వుతూ.

'అయినా వొద్దులేయ్యా!' అంది రవణమ్మ.

'సరేలే! నాలుగు రోజుల్లో వూరెళతాను. తీసికొస్తాలే!' అన్నారు మాస్టారు.

నగం బరువు తీరినట్లు వెళ్ళిపోయింది రవణమ్మ.

*　　*　　*

నెల రోజుల తరవాత ఓ సాయంత్రం చలపతిగారు టీచర్స్ రూంలో కూర్చొని పేపరులో లాటరీ ఫలితాలు ప్రకటించబడ్డ పేజీని చూస్తున్నారు. గదిలో మరెవ్వరూ ఉపాధ్యాయుల్లేరు. చాలామంది క్లాసులకూ, ఒకరూ, అరా బయటకూ వెళ్ళిన సమయం అది. రెండు నిమిషాల తరవాత ఆయన ముఖంలో హఠాత్తుగా మార్పు వొచ్చింది. కళ్ళు ఒక రకమైన ఆశ్చర్యంతో వెలిగేయి. జేబులోంచి టిక్కెట్టుకాయితం తీసి చూశేరు. ఓ నిమిషంపాటు అలాగే పేపరువైపూ, టిక్కట్టువేపూ చూశేరు. ఆ తరవాత వెంటనే లేచి బయటకెళ్ళేరు.

ఆ తరవాత ఆయన క్లాసుల్లో చాలా పరధ్యానంగా వున్నారు. ఇండియాకు ప్రెసిడెంటు ఇందిరా గాంధి అని చెప్పిన అబ్బాయిని ఆయన కోప్పడలేదు. మేష్టారి యేమరుపాటు చూచిన పిల్లలు సుభ్బరంగా చుక్కలాట ప్రారంభించేరు. అయినా చలపతిగారి కాపూట క్లాసు పట్టలేదు.

ఆ రాత్రి ఆయనకు నిద్దర పట్టలేదు. భార్యతో గానీ పిల్లల్తోగానీ ఎక్కువ మాట్లాళ్ళేదు. తవలో తానే ఆలోచించు కొంటూ, నొసలు చిట్లిస్తూ, 'ప్చ్! తప్పు!' అనుకొంటూ, మధ్యమధ్య 'సింగినాదం' అంటూ గడిపేరు.

ఎప్పుడో తెల్లవారు జాముకు పట్టిన కునుకులో కూడా కలలు. ఓ కలలో తానూ, కామాక్షి పట్టుబట్టలు కట్టుకొని, పీటలమీద కూర్చుని పెద్దకూతురి పెళ్ళి చేస్తున్నాడు. కామాక్షి మెడనిండా నగలు. పెద్దకూతురు పద్మావతి కళ్ళనిండా వెలుగు. అల్లుడు సినీమాల్లో కథానాయకుడల్లే వున్నాడు. చలపతిగారి కెదురుగ్గావున్న ఇనప్పెట్టెలో నోట్ల కట్టలు నవ్వుతున్నాయి. మరో నిమిషంలో దృశ్యం మారిపోయింది. ఓ నల్లటి దున్నపోతు నెక్కి, చిన్నప్పుడు ఆయనకు చదువు చెప్పిన ఎలిమెంటరీ స్కూలు హెడ్మాస్టరుగారు, చేత్తో బెత్తం పుచ్చుకొని, 'వెధవ కానా, రంగడి బెల్లమ్ముక్క నువు తీసికొంటావ్రటా? వెయ్ గోడ కుర్చీ' అంటున్నారు.

రాత్రంతా అట్లా కలత నిద్దరతో గడిచిపోయింది. నిద్రలేచేప్పటికి ఆయన వాలకంచూసి భార్యకూడా ఆశ్చర్యపోయింది.

'ఏవిటండీ, ముఖం అల్లా పీక్కుపోయింది? రాత్రంతా కలవరిస్తూనే వున్నారేమిటి?' అంది.

'ఆయన బలవంతాన నవ్వి' నీ ముఖం కాదూ! నేను కలవరించటం యేవిటి?' అన్నారు.

ముఖం కడుక్కొని కాఫీతాగి బయటకు రాగానే పంచలో రవణమ్మ కనిపించింది. కడుపులో తిప్పినట యి, కళ్ళు తిరిగేయి మాస్టారికి.

'ఏవిటే లాటరీ టిక్కెట్టుకోసమా? మొన్న పనుల తొందరలో మర్చిపోయానమ్మా! ఈ సాయంకాలం వెళుతున్నాను. తెస్తాలే!' అన్నారు త్వర త్వరగా.

రవణమ్మ వెంటనే అంది, 'దాని సంగతి కాదండీ! ఎప్పుడు కొంటేనేం! బాగుపడే గీతవుంటే వొస్తుంది, లేకపోతే లేదు. నే నొచ్చిందందుక్కాదు. రాత్రినుంచీ అబ్బాయికి జరం. రంగనాదంగారికి చూపిస్తే రెండు మాత్తర్లు రాసిచ్చేరు. రెండు రూపాయలుంటే యిప్పిస్తారా, ఒకటి కిస్తాను!'

చలపతిగారు మల్లగుల్లాలు పడిపోయేరు. గొంతులో కొట్టుకొంటూన్న దేదో బయటకు రాబోయింది. అయినా ఆయన నిబ్బరం గలవాడు. చిన్నపిల్లవాడు కఫాన్ని మింగినట్లుగా, గొంతులోవున్న దాన్ని అక్కడి కక్కడేమింగి, కంగారుగా అన్నారు—

'నీమనిషి దొంగలు దోల! వాడికి రాత్రినుంచీ జ్వరం కాస్తే నాకు చెప్ప లేదేం? చిన్నవెధవ ఆచీటీ యిటివ్వు. నేను బజారువేపు వెళుతున్నాను. మాత్రలు తెచ్చిపెడతాను!'

మాస్టారి మంచితనానికి వెంటనే ఏం చెప్పాలో తోచని రవణమ్మ చీటీ ఆయన కిచ్చి వెళుతూ అంది; తమరట్టాగున్నా రేందయ్యా? ఒంట్లో బావోలేదా? అని.

'ఏం లేదమ్మా! రాత్రి తలనొప్పితో సరిగ్గా నిద్రపట్టలేదు' అన్నారు.

రవణమ్మ వెళ్లిపోయింది.

తాను బడికి వెళ్లేపాటికి చలపతి గారు సత్యానికి మాత్రలూ, రొట్టె, నాలుగు బత్తాయిలూ తెచ్చి పంపిచేరు. వంటగదిలో భార్య గునుస్తున్నా ఆయన లెక్కపెట్టలేదు.

*　　　*　　　*

ఆరోజు చలపతిగారింట్లో కోలాహలంగా వుంది. బెజవాడనుంచి ఆయన తమ్ముడూ పిల్లలూ, ఏలూరు నుంచి కామాక్షి అక్కా, బావా, వాళ్లపిల్లలూ వొచ్చేరు. ఊర్లోని సాటివారందరూ, చలపతిగారింటి పంచలో చాపల మీద కూర్చొని వున్నారు. హాల్లో సత్యనారాయణ స్వామి పటంముందు కూర్చుని, పురోహితుని సాయంతో వ్రతం చేస్తున్నారు, చలపతి దంపతులు. భక్తి పారవశ్యంవల్లనో, వంటింట్లోనుంచి వొచ్చే పొగలవల్లనో ఇరువురి కళ్ల వెంటా నీళ్ళొస్తున్నాయి.

పంచలోకూర్చున్న చిన్నా పెద్దా అంతా లోకాభిరామాయణం మాట్లాడుకొంటున్నారు. మధ్య మధ్య వీలుచూసికొని లాటరీలో లక్షరూపాయలొచ్చిన చలపతి గారి అదృష్టాన్ని పొగుడుతున్నారు. ఆ అదృష్టం కొందరు చలపతిగారిదనీ, మరికొందరు కామాక్షిదనీ అంటున్నారు. ఆయన పెద్దకూతురంటే వల్లమాలిన అభిమానం గల పక్కవారబ్బాయి, 'పద్మావతి అదృష్టం వల్లనే చలపతిగారికి లాటరీ తగిలింది' అన్నాడు ప్రక్కన స్నేహితుడితో. ఎవరో తుంటరి వినీ వినపడకుండా 'మొదటిభార్య పోయిన వేళా విశేషం. ఇవ్వేళ దాని ప్రభావం చూపింది' అన్నాడు కూడాను.

వ్రతం అయింది. చలపతిగారు అందరకూ తీర్థప్రసాదాలు పంచేరు. ఆయన ప్రతి వొక్కరితోనూ అతి విధేయతగా ప్రవర్తించేరు. కొంతమంది మరీ తెలివైన వాళ్లు ఆయనకు వినబడేంత చిన్నగా, 'చూశేరా, ఆయన పెద్దమనిషి తరహా! డబ్బొచ్చినా మనిషికి ఎంత వినయమో!' అన్నప్పుడు చలపతిగారు తాత్కాలికంగా కొంత సంతోషపడ్డారు. చలపతిగారి దగ్గర చదువు కొని ఆ స్కూల్లోనే తెలుగు మాస్టారిగా పన్చేస్తున్న సత్యనారాయణ అనే చాకులాంటి కుర్రాడు ఈ తంతంతా చూసి ప్రక్కనే వున్న మిత్రుడితో అన్నాడు—

'బోడిలక్ష రూపాయలు, అందునా లాటరీలో వొస్తే, ఈ మనుషు లింత నాటకా లాడుతున్నారే! మరో లక్ష యిస్తామంటే వీళ్లంతా బట్ట లిప్పుకొని ఎగురుతారు గామాల! డబ్బు ఎంత పన్చేయిస్తుంది? ఈన విధేయతకూ, వీళ్లందరి నటనకూ కారణం డబ్బే గదా!' అని.

ఆపైని భోజనాలు. అంతా సుష్టుగా తిని యితోధికంగా త్రేన్చేరు, పొద్దుపోవటంచేతనో, అజీర్తి వల్లనో, మనసు బాగా లేకనో, చలపతిగారు మాత్రం తృప్తిగా తినలేకపోయేరు. నాలుగు మెతుకులు నంజి లేచేరు.

అంతా వెళ్లిం తరవాత, రవణమ్మా, సత్యం వొచ్చేరు భోజనానికి. లక్ష రూపాయ లొచ్చేక మాస్టారిని పలకరించటానికే భయంగా వుంది సత్యానికి,

రవణమ్మకు మ్మాత్రం ఈ విషయం చాలా ఆనందాన్నే కలిగించింది.

'పోనీలే పిల్లలు గలాయన! దేవుడు కనిపెట్టి నాడు' అనుకొంది.

రవణమ్మ, సత్యం భోజనం చేస్తుండగా, చలపతిగారు పంచలో కొచ్చి అన్నారు, 'సిగ్గుపడకండా తినరా సత్యం. ఇంక రెండు పూర్ణపుండలు వేయించుకో! నీ లాటరీ టిక్కట్టు సంగతి రెండు రోజుల్లో తెలుస్తుంది రవణమ్మా!' అని.

'నా బొంద! అందరికీ వొస్తాయా అయ్యా? పెట్టి పుట్టాలి. ఏమైనా ఇది మా అమ్మగారి అదుదృష్టమే నయ్యా!' అంది రవణమ్మ.

చలపతి గారు లోపలి కెళ్లగానే సత్యం అడిగేడు తల్లిని, 'నువ్వూ లాటరీ టిక్కట్టు కొన్నావా అమ్మా'? అని.

రవణమ్మ సిగ్గుపడుతూ అంది, 'అప్పుడెప్పుడో అయ్యగారి చేతికి రూపాయిచ్చి కొనమన్నాను.'

లోపలి కెళ్లిన చలపతిగారు టిక్కట్టు తెచ్చి సత్యానికి యిచ్చి అన్నారు, 'నీ దగ్గరుంచరా సత్యం, పేపర్లో పడ్డప్పుడు చూద్దువుగాని.'

'వాడిదగ్గ రెందుకులెండి? ఎక్కడన్నా పారేస్తాడు, మీ దగ్గరే వుంచండి.' అంది రవణమ్మ.

'అట్లా కాదులే! వాడి దగ్గరే వుండనివ్. డబ్బు చెడ్డది. మనుషులను గడ్డి తినిపిస్తుంది.' అన్నా రాయన.

డబ్బు గడ్డి తినిపిస్తుందన్న సంగతి రవణమ్మకు తెలుసునుగాని, ఈ సందర్భంలో దాన్ని ఎలా అన్వయించుకోవాలో ఆమెకు తెలీలేదు.

భోజనం చేసి వెళ్లిపోయేరు తల్లీ కొడుకులూ.

* * *

చలపతిగారన్నట్లు, మూడు రోజుల తరవాత, రవణమ్మకు తెచ్చిన లాటరీ టిక్కట్టు ఫలితాలు తెలిశేయి. సత్యం పక్కాపావుగంట వెతికినా నంబరు కనిపించలేదు. సత్యానికి బోలెడు విచారం పట్టుకొంది గాని,



FDSAS-1808 TE

రవణమ్మ దాన్నంతా బాధపడవలసిన విషయంగా తీసి కోలేదు.

'ఒంటినిండా ఆముదం రాసుకొని పుట్టెడు గింజలో పొర్లినా అంటేంత వరకు అంటు తాయి గాని, పుట్టెడు రావు గదా! ప్రాప్తం లేకపోతే ఏదీరాదు. పోనివ్! రూపాయి తోటే చెల్లు! అనుకొంది.

రోజులు గడుస్తున్నాయి. చలపతిగారు చెరువు కింద నాలుగెకరాలు మాగిరి కొన్నారు. ఇల్లొకటి చిన్నది కొన్నారు. పద్మావతికి పొరుగింటబ్బాయితో సంబంధం కుదిర్చేరు, వాళ్లబాబడిగిన కట్నం యిచ్చేందు కొప్పుకొని. ఈ డబ్బొచ్చిం దగ్గర్నుంచి చలపతిగారికి లోకుల్లో గౌరవం పెరిగింది. హెడ్మాస్టరు గూడా వెనుకటిలాగే, 'మూడో గంటకొట్టినా క్లాసుకెళ్లటం లేదేమయ్యా చలపతీ!' అనటం లేదు. 'చలపతి గారూ!' అంటున్నారు. ఇలా హఠాత్తుగా సిరెత్తుకొన్నందువల్ల కామాక్షికి భర్తమీద ప్రేమయితే కలగలేదు గాని, తనవరకు తృప్తిగానే వుంది. డబ్బుతెచ్చిన మరునాడే ఆయనతో శతపోరి, తనపేరిట ఓ పదివేలు బాంకిలో పడేయించింది కూడాను.

ఎటొచ్చీ డబ్బుతెచ్చిన సుఖమూ, తృప్తీ కన పడనిది ఒక్క చలపతి గారిలోనే. ఆయన వేషంలో మార్పేమీ రాలేదు. ఎప్పట్లాగే నీరుకావి ధోవతీ, అరచేతుల చొక్కా తొడుక్కుని తిరుగుతున్నారు. చెప్పులుమాత్రం, ఓ పదిపారేసి కొత్తవి కొన్నారు. బట్టలమాట అలావుంచి, మనిషిలో కూడా హుషారు, ఆనందం యేమీ కనపట్టం లేదు. అదేం ఖర్మో రోజు రోజుకూ ఆయన తీసిపోతున్నట్లు కనిపిస్తున్నారు పరి చయస్తులకు. ఈ డబ్బు లొచ్చిం తరవాత రవణమ్మకు ఆయన ఓ చీరెకొని పెట్టేరు. సత్యానికో జత బట్టలు కుట్టించేరు. పరీక్షలు దగ్గరపట్టంచేత వాడికి చాలా శ్రద్ధగా చదువు చెబుతున్నా రాయన.

ఇటీవల కాలంలో చలపతిగారు తమపట్ల చూపేదయకూ, సానుభూతికీ రవణమ్మ ఆయనకు మనస్సులోనే నమస్కారాలు చెప్పుకొంటోంది. 'పుణ్యా త్ముడు! డబ్బులెంతమందికి రావటం లేదు. దిక్కు లేనివాళ్ళ నెంతమంది కనిపెట్టి వుంటున్నారు? ఆయన కడుపు చల్లగాను. పిల్లవాడికి శానాకష్టపడి చదువు చెబుతున్నాడు' అనుకొంటూ, ఆయను చల్లగా చూడమని తిరుపతి వెంకన్నకు మొక్కుకొంది

*   *   *

సత్యం పరీక్షల మధ్యలోవుండగా రవణమ్మ మంచ మెక్కింది. మామూలుగా మొదలయిన జ్వరం, వదలకండా కాసి, రవణమ్మ బాగా డీలా అయి పోయింది. అట్లాగే చలపతిగారింట్లో తింటూ, పరీ క్షలు జాగ్రత్తగానే రాస్తున్నాడు సత్యం. అయినా, ఏ పని చేస్తున్నా వాడికి తల్లి అనారోగ్యమే మనసులో కదులుత్తూ, బాధపడుతున్నాడు. చివరి పరీక్షకూడా తృప్తిగా రాసిన రోజున వాడూ, అంతకంటే ఎక్కు వగా ఆ నీరసంలోనే రవణమ్మా సంతోషపడ్డారు.

ఆ రాత్రే రవణమ్మకు జ్వరం విపరీతమయి, సంధి లక్షణాలు కనిపించేయి. చలపతిగారు దగ్గరుండి డాక్టర్ను తీసికొచ్చేరు. డాక్టరు చలపతిగారి నిదివర కెరక్కపోయినా ఆయనకు పట్టిన జాతకం చూశేడు గనక పిలవగానే వొచ్చి రవణమ్మకు చాతయినంత వైద్యం చేశేడు.

మరోవారం గడచింది. రవణమ్మ రోగం డాక్టరుకు లొంగలేదు. ఆయన పెదవి విరిచేడు. సత్యానికి లోకమంతా భయంకరంగా కనపడసాగింది. వాడు కళ్ళనీళ్లు కుక్కుకుంటూ యేడుపు సాగించేడు. రవణమ్మకు మాట రావటంలేదు. కళ్ళు గాజుబుడ్లకు మల్లే మెరుస్తున్నాయి. ఆ కళ్ళవెంట ధారాపాతంగా నీళ్ళు.

'పోనీ బెజవాడ తీసికెళదామా!' అన్నారు మాస్టారు.

కేవలం ఉదారబుద్ధితో, పనిమనిషికోసం చల పతిగారు చూపుతూన్న ఔదార్యం డాక్టరుగారిని కదిల్చింది. ఆ క్షణాన, ఆయన ఇకనుంచీ బీదలకు ఉచితంగా వైద్యం చేయాలన్న నిర్ణయాన్ని తాత్కా లికంగా తీసుకొన్నారు కూడాను. చలపతి గారి వంక చూస్తూ అన్నారాయన, 'ప్రయోజనం లేదండీ మీరు తీసికెళ్ళాలనే అనుకొంటే నా కభ్యంతరం లేదు.'

చలపతిగారు మాట్లాడకండా నిలుచుండి పోయేరు. ఐదునిమిషాలలా గడచిపోయేయి.

లాంతరు వెలుగులో, రవణమ్మ చలపతిగారిని

దగ్గరకు రమ్మని సైగచేసి, కొడుకుచేతిని ఆయన చేతిలోవుంచి, కళ్ళు నీళ్లెట్టుకొంది.

చలపతిగారికి గుండెల్లో సన్నని మంటరేగి అంతలోనే రాజి పెద్దదై, శరీరమంతా వ్యాపిస్తున్న ట్లనిపించింది. బాధతో కళ్ళవెంట నీళ్ళొచ్చేయి. కొడుకు కోసం ఆ తల్లి పడేబాధ ఆయనకు భరించలేని విచారం కలిగించింది. ఆయనకేదో పూనకం వొచ్చి నట్లయి అన్నాడు.

'నువు పిల్లవాణ్ణి గురించి యేవిధమైన విచారమూ పెట్టుకోకు. వాడికి వోపిక వున్నంత వరకు చదువు చెప్పించి పైకి తీసికొచ్చే పూచీనాది. నీకింకా నామాటమీద నమ్మకం లేకపోతే భగవంతుడిమీద వొట్టేసి, వీళ్ళందరియెదటా చెబుతున్నాను. రేపే వాడిపేర ఓ అయిదువేలు బాంకిలోవేసి వాడిచదువు ఖర్చుపెడతాను, సరేనా?'

రవణమ్మ బిత్తరపోయినట్లుగా చూసింది. ఆవిడకు మాస్టారి మాటలు తెలిశాయో, లేదో మరి. సత్యానికి నోట మాట రాలేదు. అంతటి విచారంలోనూ వాడికి మాస్టారి మాటలు బోలెడంత ఆనందాన్నీ, తృప్తినీ కలిగించేయి. చుట్టూచేరిన ఇరుగు పొరుగూ, డాక్టరూ కూడా ఆశ్చర్యంగా చలపతిగారివంక చూశేరు.

ఆయన వీళ్ళ చూపులను గమనింపకుండా, రవణమ్మకేసే చూస్తున్నారు.

రవణమ్మ లేని వోపికను తెచ్చుకొని రెండు చేతులెత్తి దణ్ణంపెట్టింది చలపతిగారికి.

ఆ మరునాడు మధ్యాహ్నం రవణమ్మ పోయింది. చలపతిగారు దగ్గరుండి అన్నీ జరిపేరు. దిక్కులేకండా యేడుస్తూన్న సత్యాన్ని అక్కున చేర్చుకుని వోదార్చేరు.

చూస్తున్న వాళ్ళంతా చలపతిగారి దొడ్డ హృదయానికి సంతోషించేరు.

ఆయనచేస్తున్న ఈ మహోపకారానికి ఊరి వారంతా ఆయన్ను మనస్ఫూర్తిగా అభినందించేరు.

గిట్టనివాళ్లు, 'కాసిన్ని డబ్బులు రాగానే కిందా మీదా కనపట్టంలేదు. మిడిమేలపు సిరి. ఎట్లా వొచ్చిందో అట్లానే పోతుంది' అన్నారు.

చలపతిగారు వేటినీ పట్టించుకో లేదు.

రవణమ్మను దహనంచేసిన వారం రోజుల తరవాత వొకనాడు, చలపతిగారు సత్యాన్ని తీసికెళ్లి, బాంకిలో వాడి పేరు ఐదువేల రూపాయలు వేసేరు. అప్పటిగ్గాని ఆయన మనస్సుకు రవంత ప్రశాంతత చిక్కలేదు.

ఆ రాత్రి భోజనం పెడుతూ కామాక్షి గంయిున లేచింది.

'మేమేం బతకా లనుకొన్నారా? అడుక్కుతిని పోవా లనుకొన్నారా? మీది మరీ అంత జాలిగుండె అయితే, పదో పాతికో యిస్తారుగాని యిలా వేలకు వేలు తగలేస్తారా? మీరు వొళ్లు తెలిసి చేస్తున్న పనేనా యిది?' అని లక్టపెట్టింది.

చలపతిగారేం మాట్లాళ్లేదు.

'ఓసి వెర్రి ముఖమా! డబ్బు ఎంతటివారి నైనా గడ్డి తినిపిస్తుంది. తిన్నవాణ్ణి నా కా విషయం స్పష్టంగా తెలుసును. గడ్డి పశువుల కాహారం. మనుషుల క్కాదు. అయినా స్వార్థం బలిసిన మనిషి గడ్డి మేస్తాడు. అలా మేసినప్పుడు బయటకు చెప్పే చేవ లేక, అలా వెధవపని చేసేమన్న స్పృహ మనసును బాధిస్తే, లోకుల కళ్లు కప్పటానికి, తనను తాను రవంత తృప్తిపరచుకోవటానికీ నాలుగు మంచిపనులు చేస్తాడు. ఇందులో ఆత్మవంచనా, పరవంచనా కూడా వుంది. నేనూ అదే చేసేను. సత్యానికి నేను ఐదువేలివ్వట మేమిటి? వాడే మనకు తొంభయ్యయిదు వేలిచ్చేడు.' అని చెబుదామనుకొన్నాడు. కాని గొంతు పెగల్లేదు. రెండు నిమిషా లాగి యిలా అన్నాడు.

'ఈ శరీరాలయంలో ఒక దీపం వుంది. అది స్వచ్ఛంగా వెలిగి మనసును కాంతితో నింపుతూ వుంటుంది. మనిషి పొట్టకోసం, అలవిమాలిన కోర్కెల కోసం, వెధవపనులు చేస్తూ ఆ దీపంచుట్టూ దళసరి తెరలు కడతాడు. ఎంతటి దళసరి తెరలు కప్పినా దీపం పూర్తిగా ఆరిపోయేంతవరకూ వెలుగుతూనే వుంటుంది. ఆ మసక వెలుగులో మనిషికి మనసు లోని కుళ్లు కనిపిస్తూనే వుంటుంది. నా దీపం ఇంకా ఆరలేదు. అదీ సంగతి.'

ఈనకు పిచ్చెక్కిందనుకొంది కామాక్షి.

చలపతిగారు కళ్లు మూసికొని గోడకు ఆనుకొన్నారు.

ఆయన కనుకొలకుల్లో మెరుస్తూన్న ముత్యాలు కామాక్షికి కనిపించలేదు.